క్లుప్తంగా

పంట నమోదు వివరాలు పరిశీలన



చెరుకుపల్లి: ఖరీఫ్ సాగులో పంట నమోదు వివరాలను సూపర్ చెక్ రికార్డుల ద్వారా పరిశీలించటం జరుగుతుందని ఏవో ఎండీ ఫారూక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బలుసులపాలెం, తుమ్మలపాలెం, ఆరుంబాక, చెరుకుపల్లి గ్రామాలలో పంట నమోదుకు సంబంధించి సూపర్ చెక్ రికార్డులతో రైతుల పొలాలకు వెళ్లి రైతు పేరు, పంట రకం, సర్వే నంబరు తదితర వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో తనిఖీ చేసి సూపర్ చెక్ యాప్‌లో పొందు పరిచినట్లు ఏవో ఫారూక్ తెలియజేశారు. కార్యక్రమంలో ఏఈవోలు, బీడీ రామకృష్ణ, కొల్లూరు ప్రియాంక, వీఆర్వోలు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

గొరిగపూడిలో వైద్య శిబిరం



గొరిగపూడి(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు పీహెచ్‌సీ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గొరిగపూడి గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు జి.అబ్రహం లింకన్ వైద్య పరీక్షలు చేశారు. గ్రామ సర్పంచ్ గరిగపాటి మల్లిక శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో వైద్యులు ప్రజలను పరీక్షించి పలు సూచనలు చేసి ఉచితంగా మందులు అందించాదరు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు వెంకటేశ్వరరావు, వైద్య, ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

క్రాపలో వైద్య పరీక్షలు



కొల్లూరు: బాలింతలు, గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని క్రాపలో వైద్య శిబిరం నిర్వహించారు. కొల్లూరు పీహెచ్‌సీ సిబ్బంది స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరంలో మహిళలతోపాటు, గ్రామంలో వివిధ ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులు అందజేశారు.

వరహాపురంలో దోమల మందు పిచికారీ



వరహాపురం(వేమూరు): వరహాపురం గ్రామంలో అధానంగా ఉన్న పారిశుద్ధ్యం వల్ల దోమల బెడద ఎక్కువ అయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో గ్రామ పంచాయతీ అధికారులు గ్రామంలో అన్ని వీధుల్లో బ్లీచింగ్, దోమల నివారణకు మందును శుక్రవారం పిచికారీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి స్టాలిన్ మాట్లాడుతూ వర్షాల వల్ల దోమలు ఎక్కువయ్యాయని, వాటి నివారణకు అన్ని విధాలుగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. గ్రామంలోని అన్ని వీధుల్లో వీధి దీపాలు కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు ప్రతి రోజు చేపట్టడం జరుగుతుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, నర్సులు, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును పరిశీలించిన ఎంపీడీవో

యలవర్రు(వేమూరు): గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డను సక్రమంగా వినియోగించుకోవాలని ఎంపీడీవో మారుతీశోషాంబ అన్నారు. అమర్తలూరు మండలంలోని యలవర్రు గ్రామ పంచాయతీ పరిధిలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడి, పొడి చెత్త ద్వారా ఎరువులు తయారు చేసేందుకు ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్తుకు డిగ్రీ విద్య దోహదం

తెనాలి టౌన్: అంకిత భావంతో విద్యనభ్యసించి జీవితంలో ఉన్నతంగా రాణించాలని, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు డిగ్రీ విద్య దోహదపడుతుందని ఎన్ఆర్ఐ విద్యాసంస్థల సీఈవో సీహెచ్ ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలను నిర్వహించారు.

దాసరిపాలెం.. బురదమయం



పెదమట్లపూడి నుంచి దాసరిపాలెం రహదారి



వర్షపు నీటి నిల్వతో అధ్వానంగా మారిన దాసరిపాలెం రహదారి

- అధ్వానంగా అంతర్గత రహదారులు
- గ్రామస్తులకు తప్పని కష్టాలు

నగరం: అంతర్గత రహదారులు బురదమయంగా మారటంతో అడుగు తీసి అడుగు వేయాలంటేనే కష్టమవుతుంది. మండలంలోని తాడివాకవారి పాలెం శివారు దాసరిపాలెం వెళ్లే రహదారి అధ్వానంగా మారడంతో ఈ రహదారిలో ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి వెళ్లేందుకు పెదమట్లపూడి నుంచి ఒక దారి, రేపల్లె-నిజాంపట్నం ఆర్ అండ్ బీ రహదారి నుంచి మరో దారి ఉన్నాయి. అయితే ఈ రెండు రహదారులు అధ్వానంగా మారడంతో గ్రామస్తులు గ్రామానికి వెళ్లేందుకు నానా తంటాలు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రహదారిలో చెరువును తలపించేలా నీళ్లు నిలిచిపోయి నడవటానికి కూడా వీలులేని పరిస్థితులు నెలకొన్నాయి. ద్విచక్ర వాహనదారుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. పాలకులు గానీ అధికారులు గానీ పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిని అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాలకృష్ణనే సైకో...

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కొక్కిలిగడ్డ చెంచయ్య



మాట్లాడుతున్న కొక్కిలిగడ్డ చెంచయ్య, పక్కన పార్టీ నాయకులు

బాపట్ల: హిందూపురం ఎమ్మెల్యే, సినీ హీరో నందమూరి బాలకృష్ణనే ఒక సైకో... ఆయనే మతిస్థిమితం సరిగా లేదనే సర్టిఫికెట్ తెచ్చుకున్నారని, ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం మానుకోకపోతే ఆయన ఇంటినే ముట్టడిస్తామని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కొక్కిలిగడ్డ చెంచయ్య హెచ్చరించారు. బాలకృష్ణ అసెంబ్లీలో మాట్లాడిన మాటలను వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఖండించింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు కొక్కిలిగడ్డ చెంచయ్య మాట్లాడుతూ సైకో పాలన బాలకృష్ణ బావ చంద్రబాబు, అల్లుడు లోకేష్‌ది మాత్రమేనన్నారు. ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం మానుకోవాలని సూచించారు. రాష్ట్ర కార్యదర్శులు నక్కా వీరారెడ్డి, దొంతిబోయిన జయభారత్‌రెడ్డి, జె.జోషికాంత్ మాట్లాడుతూ నందమూరి తారక రామారావు కడుపున పుట్టిన బాలకృష్ణ అగౌరవంగా మాట్లాడటం సరికాదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్టీఆర్ పేరుతో జిల్లాను ప్రకటించి ఆయనకు సముచితస్థానాన్ని కల్పించారని గుర్తు చేశారు. చంద్రబాబునాయుడు కనీసం ఎన్టీఆర్‌ను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సరైన గుణపాఠం చెబుతామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రవిశంకర్ రెడ్డి, పవన్‌కుమార్, ఆట్ల ప్రసాదరెడ్డి, రవితేజ, మౌలాలి, రామకృష్ణారెడ్డి, మురళీకృష్ణారెడ్డి, సురేంద్ర, జె.విష్ణు, ఏసుబాబు, గోపినాథ్, కె.ప్రసన్న, సీతన్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలి



వేమూరు: సీఐటీయూ జిల్లా మహాసభలు ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించడం జరుగుతుందని సీఐటీయూ మండల కార్యదర్శి బి.అగస్టీన్ తెలిపారు. వేమూరు మార్కెట్ యార్డు ముఠా కార్మికులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే కార్మిక ప్రదర్శన, బహిరంగ సభకు వేమూరు నియోజకవర్గం నుంచి కార్మికులందరు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నిత్యం కార్మిక సమస్యలపై పోరాటాలు నిర్వహించే సీఐటీయూ భవిష్యత్ కార్యాచరణ కోసం మహాసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా కార్మికుల సమస్యలపై చర్చించి నిర్ణయాలు చేయడం జరుగుతుందన్నారు. కార్మిక వర్గం, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు, పంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు.

కృష్ణానదికి తగ్గిన వరద ఉధృతి

కొల్లూరు: కృష్ణానదికి వరద ఉధృతి తగ్గడంతో నదిలో నీటి ప్రవాహం నెమ్మదించింది. ప్రకాశం బ్యారేజ్‌కు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీరు గురువారం నుంచి క్షీణించడంతో దిగువకు విడుదల చేసే నీటిని అధికారులు క్రమేపీ తగ్గించడంతో నదిలో నీటి ప్రవాహం మందగించింది. గురువారం రాత్రి 3.28 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదిలిన అధికారులు శుక్రవారం వరద ప్రవాహ స్థాయిని క్రమేపీ తగ్గిస్తూ రావడంతో 2.42 లక్షల క్యూసెక్కుల నీరు నదిలో పారుతుంది. కృష్ణానదికి నీటి విడుదల పరిమాణం తగ్గడంతో పెసర్లంక, ఆవులవారిపాలెం, గాజుల్లంక ప్రాంతాలలోని లోతట్టు ప్రాంతాలలోకి చేరిన నీరు గణనీయంగా తగ్గడం ప్రారంభమయ్యింది. నదిలో వరద తగ్గుముఖం పట్టిన కారణంగా పల్లపు ప్రాంతాలలోని పంట పొలాల్లోకి చేరిన వరద నీరు వైదొలగడంతో రైతులకు ఉపశమనం లభించింది. మండలంలోని దోనేపూడి లో లెవల్ చప్టాపై నుంచి వరద నీటి ప్రవాహం కొనసాగుతుండటంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. పెసర్లంక, గాజుల్లంక, ఆవులవారిపాలెం గ్రామాల పరిధిలోని ఇటుక కళ్లాల్లోకి చేరిన వరద నీటి కారణంగా బట్టీలు నీట మునిగి రాయి విక్రయాలకు తాత్కాలిక విఘాతం ఏర్పడింది.

ఊపిరి పీల్చుకున్న లంక గ్రామాల రైతులు

భట్టిప్రోలు: కృష్ణమ్మ శాంతించడంతో లంక గ్రామాల రైతులు, ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. శుక్రవారం నీటి ప్రవాహం తగ్గింది. వరద వెనుకకు మళ్లడంతో రైతులు గండం నుంచి గట్టెక్కారు. లోతట్టు, మధ్యస్థ ప్రాంతాల్లోని పంటలు వరద నీటిలో చిక్కుకున్నాయి. ఓలేరు పల్లెపాలెం, పెదలంక కాకులడొంక వద్ద వరద నీరు వెనుకకు మళ్లింది. ఓలేరు, కోళ్లపాలెం, పెదపులివర్రు చప్టాలపై వరద నీరు తగ్గటంతో యథావిధిగా రాకపోకలు కొనసాగుతున్నాయి.



కృష్ణానదిలో నీటి మట్టం తగ్గడంతో సగం పైబడి బయటపడిన అరవింద వారధి పిల్లర్లు



కృష్ణానదికి వరద ముప్పు వీడటంతో పోతార్లంక వద్ద ముంపు నుంచి బయటపడిన అరటి పంట



భట్టిప్రోలు మండలం ఓలేరు పల్లెపాలెం వద్ద తగ్గిన వరద నీరు

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



ఏట్రవారిపాలెం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు

కర్లపాలెం: పరిసరాల పరిశుభ్రతతో సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుందని ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు చెప్పారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఏట్రవారిపాలెం పంచాయతీ పరిధిలో కర్లపాలెం సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ కూరగాయల మార్కెట్ వద్ద జరిగిన పారిశుద్ధ్య కార్యక్రమాలలో ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం మార్కెట్‌లోని చిరు వ్యాపారులకు సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై ఎంపీడీవో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాల్లో భాగంగా వచ్చే నెల 2వ తేదీ వరకు గ్రామ పంచాయతీలలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. వీధులలో చెత్త తీసివేసి శుభ్రం చేయటంతో పాటు బ్లీచింగ్, సున్నం చల్లించాలని దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని గ్రామ పంచాయతీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆట్ల మురళీరెడ్డి, సచివాలయం, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి స్థలం వివాదంలో వ్యక్తిపై దాడి



సమాచారం సేకరిస్తున్న పోలీసులు

కొల్లూరు: ఇంటి స్థలం విషయంలో నెలకొన్న వివాదం చిలికి చిలికి గాలివానగా మారి ఓ కుటుంబం మరో కుటుంబంపై దాడికి తెగబడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. కొల్లూరు గాడపాలెం గుంట పునుగులు చెట్టు ప్రాంతానికి చెందిన గరికా గోపాలం అనే వ్యక్తికి గరికా నాంచారయ్య అనే వ్యక్తి బంధువులకు మధ్య గత కొద్ది కాలంగా వివాదం జరుగుతుంది. ఇంటి స్థలం వద్ద దారి విషయంలో చోటు చేసుకున్న వివాదం ముదిరి దాడికి దారి తీసింది. స్థల సమస్య కారణంగా ఏర్పడిన పాత కక్షలను మనసులో పెట్టుకున్న గరికా నాంచారయ్య తన కుటుంబ సభ్యులతో కలసి వచ్చి గోపాలం భార్య, అతని సోదరుడిపై దాడి చేస్తుండగా.. విషయం తెలుసుకున్న గోపాలం ఇంటికి వెళ్లాడు. దీంతో నాంచారయ్య గోపాలంపై విచక్షణారహితంగా దాడికి పాల్పడటంతో గోపాలం అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దాడి సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకొని వివరాలు సేకరించారు. స్థానికులు, బాధితుడి బంధువుల సాయంతో పోలీసులు క్షతగాత్రుడిని 108 వాహనంలో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దాడి ఘటనపై ఇప్పటి వరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని, వైద్యశాలలో బాధితుడు ఇచ్చే రిపోర్టు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరపనున్నట్లు ఎస్ఐ జానకి అమరవర్ధన్ తెలిపారు.

కనుల పండువగా శరన్నవరాత్రి ఉత్సవాలు



రాజీవ్‌గాంధీ కాలనీలో మహాలక్ష్మిగా...



ముత్తాయపాలెంలోని రామాలయంలో...



అల్లూరు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో... కర్లపాలెం



చావలి వాలేశ్వరస్వామి దేవాలయంలో...



మోదుకూరు రామచౌడేశ్వరస్వామి ఆలయంలో..



వలివేరు స్వయంభువేశ్వర స్వామి ఆలయంలో...

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. వివిధ గ్రామాలు, పట్టణాల్లోని ఆలయాల్లో శుక్రవారం అమ్మవార్లను మహాలక్ష్మిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకున్నారు. అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు చోట్ల కుంకుమ పూజల్లో మహిళలు పాల్గొన్నారు. – బాపట్లటౌన్/ కొల్లూరు / వేమూరు/ చుండూరు(వేమూరు)/ అమర్తలూరు(వేమూరు) / భట్టిప్రోలు



చినపరిమి రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో...



గోవాడ బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలో



భట్టిప్రోలులో లక్ష్మీదేవిగా ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మ



పెదపులివర్రు రాజరాజ నరేంద్రుని ఆలయంలో...



కోటిపల్లి సోమశేఖరాలయంలో...

జగనన్న కాలనీలో సమస్యలను పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

బాపట్ల: ప్యాడిసన్‌పేట జగనన్న కాలనీలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బాధితులు మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవటంతో విష జంతువులతో భయం గుప్పెట్లో బతుకుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం రోడ్లు లేకపోగా మురుగు నీరు, వర్షపు నీటిలో జీవనం సాగిస్తున్నామని వారు వాపోయారు. అప్పులు చేసి ఇళ్ల నిర్మించుకుంటే వాటిలో ఉండటానికి సౌకర్యాలు కల్పించకపోవటం బాధాకరమన్నారు. మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినప్పటికీ ఫలితం లేదని, ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించకపోతే మున్సిపల్ కార్యాలయాన్ని బాధితులందరం కలిసి ముట్టడి చేస్తామని హెచ్చరించారు. నిరసనలో ప్యాడిసన్‌పేట అభివృద్ధి కమిటీ సభ్యులు శ్రీనివాస్, నాని, లోకేష్, సురేష్, కార్తీక్, భాగ్యలక్ష్మి, సల్మా, లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

చెరుకుపల్లి: ఈ నెల 28 ఆదివారం గుళ్ళపల్లి జెడ్పీహెచ్ స్కూల్లో నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరాన్ని చెరుకుపల్లి పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యజ్ఞ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ బెల్లంకొండ శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు. యజ్ఞ హాస్పిటల్ ఆధ్వర్యంలో బాపట్ల జిల్లాలో ఇప్పటి వరకు 25 ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించామని శ్రీకాంత్ చెప్పారు. ఈ శిబిరం డాక్టర్ మాధవి, డాక్టర్ పవన్ కుమార్ నేతృత్వంలో జరుగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

• నమ్మాలి.. ఇది విద్యుత్ స్తంభమే..!



భట్టిప్రోలు హైస్కూల్ సమీపంలో స్తంభంపై అల్లుకున్న ముళ్ల, పిచ్చి పాదలు

భట్టిప్రోలు: భట్టిప్రోలులో ఇళ్లు, దుకాణాలు విద్యుత్ సరఫరా చేసే స్తంభాలపై ముళ్ల, పిచ్చి పాదలు, కలుపు జాతి మొక్కలు అల్లుకున్నాయి. దీని వల్ల తరచూ విద్యుత్ అంతరాయం తలెత్తుతోందని అయినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ శాఖాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఆయా మార్గాల్లో వెళ్లే వారు పొరపాటున మొక్కలను తాకితే విద్యుత్ ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. స్థానిక హైస్కూల్ సమీపంలో విద్యుత్ స్తంభంపై మొక్కలు అల్లుకున్నాయి. అలాగే గ్రామంలో కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు కిందకు తక్కువ ఎత్తులో ఉండటం వల్ల తీగలు తగులుతున్నాయి. చెట్ల పొదలు పెరిగి తరచూ సరఫరాలో అంతరాయం కలుగుతుండడంతో ఈ ప్రాంతంలో వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దీనిపై ఏపీసీపీడీసీఎల్ ఇన్‌చార్జి ఏఈ బలిజేపల్లి రాఘవేంద్ర తరఫున సిబ్బందిని వివరణ కోరగా పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు.

పంట కోత ప్రయోగంపై శిక్షణ



మాట్లాడుతున్న ఏవో హేమంత్ భరత్ కుమార్

అమర్తలూరు(వేమూరు): పంట కోత ప్రయోగం వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయని ఏవో హేమంత్ భరత్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతు సేవ కేంద్రంలో పంట కోత ప్రయోగంపై శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సహాయ గణాంక అధికారి కొండలరావు వ్యవసాయ విస్తరణాధికారులు, వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులకు పంట కోత ప్రయోగం చేసే విధానం, జాగ్రత్తలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రెవెన్యూ గ్రామంలో ర్యాండమ్‌గా నలుగురు రైతులనను ఎంపిక చేసుకుని వారి పొలాలు సందర్శించి రైతుల పంట వివరాలు కొలతలతో సహా ఫారం-1లో, పంట కోత కోసి ఆ ధాన్యాన్ని నూర్పి తూకం వేసి ఫారం-2లో నింపాలన్నారు. ఈ పంట కోత ప్రయోగం చాలా కచ్చితంగా, జాగ్రత్తగా చేయాలన్నారు. కోతే కోసే రెండు రోజుల ముందే పర్యవేక్షణ అధికారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు డి.మాధవి, బి.మణికంఠ, కె.తిరుపతమ్మ, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

తెనాలి టౌన్: స్థానిక వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాలలో శనివారం జరిగే జాబ్‌మేళాను నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో అత్తోట దీప్తి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆమె కార్యాలయంలో మాట్లాడుతూ ఉదయం 10-సాయంత్రం 4 గంటల వరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా జరుగుతుందని తెలిపారు. 20 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి రూ.15 వేలు నుంచి రూ.20 వేలు వరకు ప్రారంభ జీతంగా ఇస్తారని చెప్పారు.

పరిసరాల పరిశుభ్రత అవసరం



పారిశుద్ధ్య డ్రైవ్‌లో పాల్గొన్న సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి

తెనాలి టౌన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ బండికళ్ళ ప్రసాద్ పేర్కొన్నారు. రూరల్ మండలం కఠెవరం గ్రామంలో శుక్రవారం ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ శుక్రవారం నిర్వహించారు. సర్పంచ్ బండికళ్ళ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి గౌస్ మొహిద్దీన్ పాల్గొన్నారు. గ్రామంలోని మురుగు కాల్వలను శుభ్రం చేయించారు. ప్రతి రోజు కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తాచెదారం రోడ్లపై వేయవద్దని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.